ప్రజాశక్తి

బుధవారం 16 జూలై 2025 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర

- రంగంలోకి పోటీ కార్మికులు ?
- ఒక్కో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఖాతాలో రూ.2 లక్షలు జమ !

ప్రజాశక్తి - విజయవాడ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం... మరోవైపు ఆ కార్మికులు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. 21 రోజుల నుంచి కార్మికులు చేస్తున్న సమ్మె విచ్ఛిన్నానికి పలు రూపాల్లో కుయుక్తులు పన్నుతోంది. దీనిలో భాగంగా బుధవారం నుంచి పోటీ కార్మికులను రంగంలోకి దించుతోంది. మూడు వారాల నుంచి సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా మూడు రోజుల నుంచి విజయవాడ నగరంలో నాలుగు వేల మందికిపైగా కార్మికులు మూకుమ్మడిగా సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. అతి తక్కువ సంఖ్యలో ఉన్న పర్మినెంట్ కార్మికులు (ప్రతి డివిజన్లో ఐదు నుండి పది మంది వరకు), పలువురు ఇతర కార్మికులను అధికారులు ఏర్పాటు చేసి, వివిఐపి, విఐపిలు తిరిగే ప్రధాన రహదారులతోపాటు రద్దీ ప్రాంతాల్లో అడపాదడపగా అతి కష్టంగా గత మూడు రోజుల నుంచి పారిశుధ్య నిర్వహణ చేస్తున్నారు. అయితే ఎక్కడైతే అత్యధికంగా యుజిడి, డ్రైనేజి వ్యవస్థ దెబ్బతిని, చెత్త ఉత్పత్తి అవుతుందో (మురికివాడలు, కొండ ప్రాంతాలు, నగర శివారు, ఫ్లైఓవర్లు, ముఖ్య కూడళ్లు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ రోజుల తరబడి పడక వేసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన, దోమలు, ఈగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వ వైఖరిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రోజు రోజుకూ సమ్మె ఉధృత రూపం దాల్చడమే గాక, కార్మికులందరూ సమ్మె బాట పట్టడంతో అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు దిక్కుతోచడంలేదు. రానురాను పారిశుధ్య నిర్వహణ స్తంభించిపోయే ప్రమాదం ఏర్పడింది. అక్కడక్కడ ఆయా డివిజన్లలో ముగ్గురు నలుగురు కార్మికులతో పనులు చేయిస్తూ మొక్కుబడిగా పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు. ఏమి చేయాలో అర్థంకానీ పరిస్థితుల్లో చివరకు కార్మికులు చేస్తున్న సమ్మెను ఎలాగైనా విచ్ఛిన్నం చేయాలని, సమ్మెప్రభావం ఏమీ లేదని ప్రజల్లో ప్రచారం చేసేందుకు ప్రభుత్వం, నగరపాలక సంస్థ అధికారులు ప్రయత్నిస్తున్నారు. అంతేగాక ఎలాగైనా పోటీ కార్మికులను రంగంలోకి దించి పారిశుధ్య నిర్వహణ బాగా జరుగుతుందనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజయవాడ నగర పాలక సంస్థ అధికారులను ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి పోటీ కార్మికులను రంగంలోకి దించేందుకు నగర సంస్థ కమిషనర్, ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పర్మినెంట్ కార్మికులతోపాటు ప్రతి డివిజన్‌కు ఏ మేరకు కార్మికులు అవసరమవుతారో గుర్తించి, ఆ మేరకు పోటీ కార్మికులను పనిలోకి పెట్టేందుకు అధికారుల కసరత్తు చేశారు. దీనిలో భాగంగా శానిటరీ ఇనిస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ సూపర్ వైజర్లతో ప్రజారోగ్య విభావగం ముఖ్యఅధికారి (సిఎంఒహెచ్) మంగళవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పోటీ కార్మికులను ఏర్పాటు చేసుకొని ఎక్కడిక్కడ పారిశుధ్య పనులు చేపట్టాలని, అవసరమైతే పోటీ కార్మికులకు పని చేసిన వెంటనే కూలి డబ్బులు ఇచ్చేలా ఒక్కో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఖాతాలో రూ.2 లక్షల చొప్పున నగదు జమ చేసినట్లు తెలిసింది. ఇదే అదనుగా పోటీ కార్మికులను తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటున్న సంబంధిత పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టర్లు, ప్రజారోగ్య విభాగం అధికారులు కుమ్మక్కయి మస్టర్లో మాయాజాలానికి శ్రీకారం చుట్టే ప్రమాదం లేకపోలేదని ఆరోపణలు వస్తున్నాయి. గత అనుభవాలను గుర్తు చేస్తూ ఈ సందర్భంగా పలువురు కార్మికులు, అధికారులు గుర్తుచేస్తున్నారు. దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఇంజినీరింగ్-పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించని ప్రభుత్వం... వారి సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు పోటీ కార్మికులను రంగంలోకి దించే చర్యలను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందని హెచ్చరించింది. పోటీ కార్మికులను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని, కేసులకు, అధికారుల వత్తిడులకు తలొగ్గేది లేదని యూనియన్ నేతలతోపాటు కార్మికులు స్పష్టం చేస్తున్నారు.



ప్రభుత్వ మొండి వైఖరితో

తిరువూరులో తాగునీటి ఎద్దడి

- వెలగని వీధిలైట్లు

ప్రజాశక్తి - తిరువూరు : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తుండడంతో ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. సమ్మెపై అధికారులు స్పందించకపోవడంతో పట్టణ ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోంది. పట్టణంలో రెండు రోజులకొకసారి వచ్చే కుళాయి నీళ్ల ఒక్కసారిగా ఆగిపోయాయి. వీధులన్నీ అంధకారంలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తాగునీరు సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. క్యాన్లు తీసుకుని వాటర్ ట్యాంక్‌ల వద్దకు, నేరుగా పంపింగ్ స్కీమ్‌ల వద్దకు వెళ్లినా ఫలితం ఉండడంలేదు. మంచినీరు వదిలే కార్మికులు కూడా సమ్మెలో ఉండటంతో మోటర్ వేసే వారు లేక పంపింగ్ స్కీమ్ వద్ద ఉన్న కుళాయి నుండి వచ్చే బొట్టుబొట్టు నీటి కోసం ప్రజలు పడిగాపులు పడుతున్నారు. వర్షా కాలమైనా ఎండలు తీవ్రంగా ఉండటంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుందరయ్య కాలనీ, భగత్ సింగ్ కాలనీ, చింతల కాలనీ(మిగతా 2లో)

నదుల అనుసంధాన కర్త కె.ఎల్.రావు

మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - విజయవాడ : నదుల అనుసంధాన ప్రక్రియ ద్వారానే ఆధునిక భారతదేశ అభివృద్ధి సాధ్యమని 50 ఏళ్ల క్రితమే చెప్పిన గొప్ప దార్శనికుడు, ప్రఖ్యాత ఇంజినీరు కె.ఎల్.రావు అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కొనియాడారు. విజయవాడలో మంగళవారం జరిగిన డాక్టర్ కె.ఎల్.రావు 124వ జయంతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. విజయవాడ దుర్గాఘాట్‌లోని ఇరిగేషన్ మోడల్ గెస్ట్ హౌస్ దగ్గర ఉన్న కె.ఎల్.రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ దేశ ఇరిగేషన్ రంగానికి కె.ఎల్.రావు చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. అజరామరమైనవని ప్రశంసించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, హిరాకుడ్ వంటి అనేక బహుళార్థక సాధక ప్రాజెక్టుల రూపకల్పనలో కె.ఎల్ రావు పోషించిన పాత్ర ప్రధానమైనదని, ప్రముఖమైనదని నిమ్మల గుర్తు చేశారు. నీరుంటేనే నివాసాలు సాధ్యమని, నీరుంటేనే పంటలు పండి సిరిసంపదలు సిద్ధిస్తాయని నమ్మిన గొప్ప దేశభక్తుడు డాక్టర్ కె.ఎల్.రావు అని మంత్రి పేర్కొన్నారు. ఆనకట్టలంటే ఆధునిక దేవాలయాలని, ఆర్థిక అభివృద్ధికి సాధనాలనే నానుడి ఆయన కాలంలోనే వచ్చిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు నిరంధించాలనే కత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం కషి చేస్తోందని చెప్పారు. 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తి చేస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రెండు శాతం పనులు కూడా చేయకుండా గాలికి వదిలేసిందని నిమ్మల విమర్శించారు. అలాగే ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం నదుల అనుసంధానంలో భాగంగా పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి రూ.1300 కోట్లు వెచ్చించి గోదారని నీటిని కృష్ణానదిలో కలిసేలా చేసిన ఘనత దక్కించుకుందన్నారు. నదుల అనుసంధాన ప్రక్రియకు ఆనాడే కె.ఎల్.రావు బీజం వేస్తే... ఇప్పుడు దానిని ఆచరించి అమలు చేసి చూపిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. అనంతరం పలువురు సీనియర్ ఇంజినీర్లను మంత్రి నిమ్మల ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాల కష్ణారావు, కష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవబోయిన వెంకటేశ్వర రావు, ఈఎన్సీ అడ్మిన్ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

18న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈనెల 18వ తేదీన విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ...అధికారులతో కలిసి జాబ్‌మేళా కేలండర్, మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ మేళాలో ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, సాండ్ స్పేస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, విక్టర్ ఇండియన్ టెక్నికల్ సపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్, జస్ట్ డయల్ లిమిటెడ్,హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, జోయలుక్కాస్ ఇండియా లిమిటెడ్, ఆర్.ఆర్ ట్రేడర్స్ అండ్ మ్యానుఫ్యాక్చరర్స్, బ్లూ డార్ట్ ఎక్స్ప్రెస్ లిమిటెడ్, జ్యోతి ఫెసిలిటీ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ బాలాజీ గ్లోబల్ ఇన్సూరెన్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ లక్ష్మీ సాయి ఇంటర్నేషనల్ డెంటల్ కేర్, ముత్తూట్ మినీ ఫైనాన్సియర్స్ లిమిటెడ్, ఫాక్స్ కాన్, ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, కూరాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్.వి గ్లోబల్ (మిగతా 2లో)

సాగునీటి సరఫరాపై కార్యాచరణ ప్రణాళిక

కలెక్టర్ బాలాజీ ఆదేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ... జల వనరుల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం మచిలీపట్నంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బాలాజీ.. వంట కాల్వలకు సాగునీరు విడుదలపై జల వనరుల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ ఇంజనీర్లు రేఖాచిత్రపటం ద్వారా సాగునీరు విడుదలపై జిల్లా కలెక్టర్‌కు వివరించారు. రైవస్ కాల్వకు 5200 క్యూసెక్కులు, బందరు కాల్వకు 3 వేల క్యూసెక్కులు, ఏలూరు కాల్వకు 1500 క్యూసెక్కులు సాగునీటిని విడుదల చేసినట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చాలాచోట్ల రైతులకు సాగునీరు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన చేస్తున్నారని, వారి నుండి చాలా ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. పంట కాల్వలకు అనుకున్నంతగా సాగునీరు విడుదల కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులకు ఎలాంటి సాగునీటి సమస్య లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో ఇంజనీర్లతో సహా కింది స్థాయి సిబ్బంది లష్కర్లంతా పంట కాల్వల వెంబడి ముమ్మరంగా తిరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే గుర్తించి పరిష్కారానికి కషి చేయాలన్నారు. తాను కూడా పర్యటించి వంట కాల్వల పరిస్థితిని పరిశీలిస్తానన్నారు. ఈసమావేశంలో జల వనరుల శాఖ ఎస్ఈ ఆర్.మోహన్ రావు, ఈఈలు ఆంజనేయ ప్రసాదు, రవికిరణ్, పలువురు డిఇలు, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ చిత్రంలో కలిమిశ్రీ, చొప్పా రాఘవేంద్రశేఖర్

'ప్రణామం' కవి సమ్మేళనం గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న బందరురోడ్డులో గల అంబేద్కర్ స్మృతివనం ఆవరణలో జరిగే 'ప్రణామం' కవి సమ్మేళనం గోడపత్రికను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మంగళవారం విజయవాడలోని కలెక్టరేట్లో గల తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లెతీగ అధ్యక్షులు కె.కలిమిశ్రీ మట్లాడుతూ ఈ కవి సమ్మేళనాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభిస్తారని, వివిధ ప్రాంతాలకు చెందిన కవులు పాల్గొని భాష, సామాజిక స్పృహ, దేశభక్తి, ప్రపంచశాంతి, పర్యావరణం అంశాలపై తమ కవితలను వినిపిస్తారని తెలిపారు. పాల్గొన్న కవులందరికీ ప్రశంసాపత్రం, బుక్ ఆఫ్ భారత్ రికార్డ్స్ చిరు జ్ఞాపికతో సత్కారం ఉంటుదని తెలిపారు. మల్లెతీగ ఉపాధ్యక్షుడు చొప్పా రాఘవేంద్రశేఖర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన ఏర్పాటు ఉందని, అంబేద్కర్ స్మృతివనం పార్కు సందర్శన టికెట్లు కూడా అందిస్తామని పూర్తి వివరాలకు 92464 15150 నెంబరులో సంప్రదించవచ్చని అన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఖాతాదారులకు అధునాతనమైన, మెరుగైన, సత్వర సేవలందించడం ధ్యేయంగా తమ బ్యాంక్ పనిచేస్తోందని కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు బ్యాంకు ఖాతాదారుల సమావేశం విజయవాడ విద్యాధరపురం శాఖలో జరిగింది. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ బ్యాంకు స్థాపించి 26 ఏళ్లు పూర్తయ్యాయని, వివిధ జిల్లాలో ఇప్పటికే 34 శాఖలను స్థాపించామని చెప్పారు. రాబోయే రెండు మూడు నెలల్లో మరో 4 శాఖలను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. ఖాతాదారులకు సత్వర సేవలను అందిస్తూ రూ.1038 కోట్ల డిపాజిట్లతో, రూ.690 కోట్ల రుణాల మంజూరుతో మొత్తం రూ.1728 కోట్లు వ్యాపారం చేస్తోందని వివరించారు. ఖాతాదారులు, శ్రేయోభిలాషుల ఆదరణతో మరింత వినూత్న సేవలను అందించనున్నట్టు తెలిపారు. అనంతరం పలువురు ఖాతాదారులు మాట్లాడుతూ సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.శ్యామి కిషోర్, ఓఎస్డీ శాస్త్రి, రీజనల్ మేనేజరు జాస్తి మురళి, విద్యాధరపురం శాఖ మేనేజరు సాయి మహేంద్రనాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు

కేతనకొండ హౌసింగ్ సొసైటీ వివాదంపై తీర్పు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఎపి రెరా) మంగళవారం రియల్ ఎస్టేట్ రంగంలో ఓ సంచలన తీర్పును వెలువరించింది. కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలు సభ్యుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడటం, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయకపోవడం వంటి వాటిపై తీవ్రంగా స్పందించింది. ఎన్‌టిఆర్ జిల్లా కేతనకొండలో ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గహ నిర్మాణ సంఘం పేరుతో ఏర్పాటైన సొసైటీలో సభ్యుడైన ఐ.నాగ విష్ణు శివ కేశవ రావు అనే ఫిర్యాదు దారు దాఖలు చేసిన కేసులో ఎపి రేరా హౌసింగ్ సొసైటీలకు చెంపదెబ్బ లాంటి ఆదేశాలు జారీ చేసింది. ఇందులో ముఖ్య అంశాలను పరిశీలిస్తే అదనపు వసూళ్లకు చెక్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లో పేర్కొన్న ధర కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేయకూడదని సొసైటీలను రెరా స్పష్టం చేసింది. డెవలప్‌మెంట్ ఛార్జీల పేరుతో చదరపు గజానికి రూ.1,200 అదనంగా వసూలు చేయాలనే డిమాండ్‌ను చట్టవిరుద్ధంగా ప్రకటించింది. ప్లాట్ల స్వాధీనం తప్పనిసరి ఫిర్యాదు దారుడికి చెందిన ప్లాట్ నెం.353ను 30 రోజుల్లోగా అప్పగించాలని సొసైటీని ఆదేశించింది. ఆలస్యానికి వడ్డీ, ప్లాట్ ధరపై వసూలు చేసిన మొత్తానికి డిపాజిట్ చేసిన తేదీ నుండి స్వాధీనం అప్పగించే వరకు 11 శాతం (ఎస్‌బిఐ ఎంసిఎల్‌ఆర్ 9 శాతం, 2 శాతం) వడ్డీ చెల్లించాలని రెరా ఆదేశించింది. కోవిడ్-19 మినహాయింపు కాలం దీనికి వర్తించదు. బై-లాస్ అడ్డుగోడ కాదు. సొసైటీల అంతర్గత బై-లాస్‌లు లేదా జనరల్ బాడీ తీర్మానాలు రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు, రెరా నిబంధనలకు విరుద్ధంగా ఉండకూడదని రెరా తేల్చి చెప్పింది

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నేతల అరెస్టు

ప్రజాశక్తి - విజయవాడ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలను కోతలేకుండా అందివ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డిఎలు, సరెండర్ లీవుల ఎన్కాష్మెంట్, గ్రాట్యుటీని ప్రభుత్వం చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ విభాగంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులతో మంగళవారం 'చలో విజయవాడ' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించేందుకు వెళుతున్న నేతలను పోలీసులు అడ్డగించారు. 13 మంది నేతలను అరెస్టు చేసి సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనాయకులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, కోశాధికారి తాడికొండ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీల ఎన్నిక



ప్రజాశక్తి - చందర్లపాడు : ఆశ వర్కర్స్ యూనియన్ చందర్లపాడు మండల మహాసభ స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కమల మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీల జీవోలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆశ వర్కర్ల రిటైర్మెంట్ వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, పని భారం తగ్గించాలని, గ్రాట్యూటీ, మెటర్నటీ లీవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్, మండల కార్యదర్శి వి.ఏసోబు పాల్గొన్నారు. అనంతరం ఆశ వర్కర్స్ యూనియన్ చందర్లపాడు పిహెచ్‌సి నూతన అధ్యక కార్యదర్శులుగా వి.రాణి, కె.ఈశ్వరమ్మ, కోశాధికారిగా కె.మేరి, జాయింట్ సెక్రెటరీగా కె. రేణుక, వైస్ ప్రెసిడెంట్ గా జయమ్మ, ఎన్నికయ్యారు. యూనియన్ చింతలపాడు పిహెచ్‌సి నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఇ.కమల, కె.దుర్గాభవానీ, కోశాధికారిగా కె.యమున, జాయింట్ సెక్రెటరీగా కె.పద్మావతి, వైస్ ప్రెసిడెంట్‌గా కె. సువర్ణ ఎన్నికయ్యారు

245 బంగారు కుటుంబాలు దత్తత

మహానగర్ లయన్స్‌క్లబ్, 'అమ్మ'కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - విజయవాడ : సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన పీ4 విధానంలో "మేము సైతం భాగమవుతాం" అంటూ విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ముందుకురావడం అభినందనీయమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఈ సంస్థలను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది మార్గదర్శులుగా ముందుకురావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పీ4 విధానం కింద బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని ఆ కుటుంబాల అభివద్ధికి మార్గదర్శిగా వ్యవహరిస్తామని, సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారానికి కషిచేస్తామని ఉన్న ప్రతిజ్ఞ పత్రాలను విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే దాదాపు 1,500 మంది మార్గదర్శులుగా నమోదయ్యారన్నారు. ఈకార్యక్రమంలో విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వక్కలగడ్డ భాస్కరరావు, జోన్ ఛైర్‌పర్సన్ ఎన్‌వీ గుప్తా, కార్యదర్శి ఎల్.నాగబెనర్జీ, పాస్ట్ ప్రెసిడెంట్స్ ఐ.లక్ష్మణరావు, కందుల నాగేశ్వరరావు, అదేవిధంగా ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు దోనేపూడి దుర్గాప్రసాద్, జీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, మహానగర్ లయన్స్ క్లబ్, అమ్మ ప్రతినిధులు

కేసులకు భయపడేది లేదు

ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - నందిగామ : స్థానిక ఓసీ క్లబ్‌లో వైసిపి ఆధ్వర్యాన జరిగిన 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో తాను 'రప్ప రప్ప' అనే సినిమా డైలాగును తాను వాడితే కూటమి నాయకులు మాత్రం 'రప్ప రప్ప నరుకుతా' అని మాట్లాడినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్ విమర్శించారు. అసత్య ప్రచారాన్ని టిడిపి నాయకులు తనకు ఆపాదిస్తూ నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు పోలీస్‌స్టేషన్లలో పలు సెక్షన్ల కింద కేసులు పెట్టించారని పేర్కొన్నారు. దీనికి భయపడేదిలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంగా నందిగామ నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని విమర్శించారు. ఎంఎల్‌సిగా, విపక్ష నేతగా అధికార పార్టీ చేస్తున్న అన్యాయాలను, అవినీతి అక్రమాలను ప్రశ్నించడం తన బాధ్యతన్నారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ ప్రతిపక్షంలో ఉండగా చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. ఎంఎల్‌ఎ సౌమ్య కొండలు, చెరువులు లూఠీ చేస్తున్నారని ఆరోపించారు. ఎంఎల్‌ఎ ధన దాహానికి రాఘవాపురం కొండల్లో నిండు ప్రాణం బలైందన్నారు.

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ మొండి వైఖరితోల

తిరువూరులో తాగునీటి ఎద్దడి

తంగెళ్ళబీడు, రాజుపేట కొత్త కాలనీ, పి. టి.కొత్తూరు బిసి కాలనీ, సుగాలి కాలనీ, అప్పనాలపేట, మాస్కో బజారు, సీతామ హాలక్ష్మి కాలనీ, తోకపల్లి, ఏకలవ్య కాలనీ, ఇందిరా కాలనీ, మధిర రోడ్డు దళితపేట, గాజుల మాలపల్లి, బస్టాండ్ ఏరియా, మేదర్ బజారు తదితర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలు నగర పంచాయతీ సరఫరా చేసే తాగునీటి పైనే ఆధారపడి ఉన్నారు. మినరల్ వాటర్ తాగితే ఆరోగ్య సమస్యలు వస్తుండటంతో కుళాయి నీళ్ళ తాగుతున్నామని, ఆ నీళ్లు రాకపోతే ఎలా బతకాలో అర్థం కావడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళలో వీధి దీపాలు వెలిగటం లేదని, దీంతో బిక్కుబిక్కు మంటూ రోడ్లపై నడవాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ వేతనాలు పెంచాలని, అలాగే సంక్షేమ పథకాల ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారంటగా, ప్రభుత్వం ఎందుకు వారి డిమాండ్లను పరిష్కరించలేకపోతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మనోజ చెబుతున్నా ఆచరణలో జరగడంలేదు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరింపజేసి సమ్మె విరమింప చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

18న మెగా జాబ్‌మేళా

సొల్యూషన్స్, ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్ వంటి సుమారు 25 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాలలోపు యువత అర్హులని, ఎంపికైన వారికి మంచి వేతనంతోపాటు ఇతర సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లింక్ ద్వారా తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలని సూచించారు. మెగా జాబ్ మేళాకు రెజ్యూమ్ లేదా బయోడేటా, ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్, పీఏఎన్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959984226, 9347779032 నంబర్లను సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కేఎన్‌వీ నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

పి4 అమలుపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన పి4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన కలెక్టరేట్ లోని తన చాంబర్లో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యసాధనలో భాగంగా పి 4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్షిప్) కార్యక్రమం అమలు పురోగతిపై నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ఈ క్రమంలో అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి వచ్చిన ప్రణాళిక విభాగం అసిస్టెంట్ మేనేజర్ దుర్గాప్రసాద్ పి4 కార్యక్రమ ముఖ్య లక్ష్యాలు, కీలక పనితీరు సూచికలు, జనాభా నిర్వహణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పేదరిక నిర్మూలనలో పి4 కార్యక్రమం కీలకంగా వ్యవహరించనున్నదని, పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన సమస్యలు, సలహాలు సూచనలు తెలియజేయాలని కోరారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించడంతో పాటు వారిని దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలను గుర్తించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్గదర్శిలు బంగారు కుటుంబాలను ఎంచుకునే క్రమంలో ఆన్లైన్ పోర్టల్ లో కేవలం కుటుంబ యజమాని పేరు మాత్రమే కాకుండా కుటుంబంలోని సభ్యులందరి పేర్లు తదితర వివరాలు ప్రదర్శితమయ్యే విధంగా చూడాల్సిన అవసరం ఉందని, అదేవిధంగా ఒకే బంగారు కుటుంబాన్ని అవసరాల వారీగా ఎక్కువ మంది మార్గదర్శిలు ఎంచుకునే సౌలభ్యం ఉండాలని ప్రణాళిక విభాగం అసిస్టెంట్ మేనేజర్ కు సూచిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో మరిన్ని మార్పులు చేర్పులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు జెడ్పి సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ ఎన్వీ శివ ప్రసాద్, డిపిఓ డాక్టర్ జే అరుణ, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, పశుసంవర్ధక శాఖ అధికారి చిన నరసింహులు, మార్కెటింగ్ ఎడి నిత్యానంద్, సిపిఓ ఎస్ భీమరాజు పాల్గొన్నారు.



ఆట స్థలాన్ని శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు: సచివాలయం వద్ద ఉన్న ఆట స్థలాన్ని శుభ్రం చేయాలని సిపిఎం నాయకులు బర్రె లెనిన్ కోరారు. బాపులపాడు మండలంలోని బండారుగూడెం గ్రామంలో సచివాలయం వద్ద ఉన్న ఆట స్థలం చెత్త చెదారంతో నిండిపోయి డంపింగ్ యార్డ్‌గా మారిందని దీని కారణంగా దుర్గంధం వెద జల్లుతుందని, ఆటలు ఆడుకునే పిల్లలకు అనారోగ్యాలు వాటిల్లే ప్రమాదం ఉందని, దీనిని శుభ్రం చేయాల్సిన బాధ్యత పంచాయితీపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు అందజేశారు.

భూ సర్వే పూర్తి

ప్రజాశక్తి-ఉయ్యూరు: మండలంలోని చినఓగిరాల గ్రామ భూ సర్వేని పూర్తి చేశామని దీనిపై అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని మండల తాసిల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం గ్రామ సచివాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ రైతుల సదస్సులో సర్వేకు ముందు సర్వేకు తర్వాత భూహక్కుదారుల జాబితాను వివరాలను ప్రదర్శించి సరిచూసుకోవాలని సూచించారు. దీనిపై అభ్యంతరాలు ఉన్నచో రాతపూర్వకంగా తెలియజేయవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

పేద పిల్లలను దత్తత తీసుకోవాలి

ప్రజాశక్తి-గన్నవరం: పేద పిల్లలను దత్తత తీసుకుని బాగా చదివించడం ద్వారా వారిని వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం కృషి చేయాలని విద్యాశాఖ గన్నవరం నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ షాహిద్ బాబు కోరారు. మంగళవారం గన్నవరం మండల్ పరిషత్ మీటింగ్ హాలులో ఉంగుటూరు, బాపులపాడు, గన్నవరం మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల యజమానులతో సమావేశం జరిగింది. షాహిద్ బాబు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు మీ పాఠశాలలో చదివే పేద పిల్లల్లో కొంతమందిని దత్తత తీసుకొని వారికి చదువులో చేయూత అందించాలన్నారు. కేవలం ఫీజుల కోసమే పాఠశాలను నడపడం సరికాదని, ప్రభుత్వ ఆలోచనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డివైఈవో రవికుమార్, గన్నవరం తహసిల్దార్ వెంకట శివయ్య, ఎంఈఓలు కమల, సాంబశివరావు, బాల సింగ్, గన్నవరం ఎంపీడీవో స్వర్ణలత పాల్గొన్నారు.

చిన ఓగిరాలలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-ఉయ్యూరు: మండలంలోని చినఓగిరాల గ్రామంలో మంగళవారం కేంద్ర బృందం పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించింది. ప్రభాత్ శర్మ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం తొలుత గ్రామ సచివాలయాన్ని సందర్శించి వివిధ శాఖలకు చెందిన, తయారు చేయబడ్డ పథక నివేదికలను పరిశీలించారు. శాఖల వారి సమీక్ష జరిపిన వారు విడివిడిగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని పాఠశాలలు, అంతర్గత రోడ్లు, అంగన్వాడీ కేంద్రాలను, స్వయంగా వెళ్లి పరిశీలించి నివేదిక తయారు చేసుకున్నారు. అనుసంధానకర్త వ్యవహార శైలి గ్రామంలో విమర్శలకు తావిచ్చింది. సమస్యాత్మక విషయాలు బృందం దృష్టికి తీసుకు రాకుండా దాచే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. మూడు రోజుల పర్యటన ముగించుకుని కేంద్ర బృందం బుధవారం తోట్లవల్లూరు మండలంలో పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు.



గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-మోపిదేవి: పెదప్రోలులో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా ఆరు ఎకరాల గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. పెదప్రోలు గ్రామానికి చెందిన బాచు శ్రీనివాసరావు తన పశువుల మేత కొరకు ఆరు ఎకరాల గడ్డివాముని ఉంచాడు. అకస్మాత్తుగా గడ్డివాము వద్ద అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా పెద్ద ఎత్తున మంటలు సంభవించాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేయగా అదుపు కాకపోవడంతో అవనిగడ్డ ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ రావడానికి ఆలస్యం కావడంతో గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. గత కొన్ని సంవత్సరాల నుండి చల్లపల్లిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. అనేకసార్లు వినతిపత్రాలు కూడా అందించారు. కానీ స్పందన లేదు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే మొవ్వ, అవనిగడ్డ, మచిలీపట్నం నుండి ఫైర్ ఇంజన్ రావాల్సి ఉంది. ఒక ప్రక్కన రహదారులు అధ్వానంగా ఉండడం, మరో పక్కన ట్రాఫిక్‌తో పాటు సుదూర ప్రాంతం నుండి రావాలి ఉండటంతో అగ్ని ప్రమాద సంఘటన స్థలానికి ఫైర్ ఇంజన్ రావడానికి ఆలస్యం జరుగుతుంది. దీంతో నష్టం అధికంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని చల్లపల్లిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-చల్లపల్లి: మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాఊ అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం పాఠశాలకు వెళ్లే దారిలో తమ తల్లుల పేరుతో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ మొక్కలు లేకుండా మానవ జీవిత మనుగడ సాధ్యం కాదన్నారు. ఆరోగ్యానికి, పర్యావరణ, నీటి సంరక్షణకు మొక్కలను విరివిగా నాటడం తప్పనిసరి అన్నారు .మొక్కలు నాటడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించి ఒత్తిడి, ఆందోళనలు తగ్గి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బి.నాగలక్ష్మి ,జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులు పంటల బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు: మండలంలోని రైతులంతా పంటల భీమా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద అవుటపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ క్రాప్ లోన్ తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంకులు పంటల భీమా క్రింద ప్రీమియం చెల్లింపులు చేస్తాయని వారికి విపత్తులు సంబవించినప్పుడు నష్ట పరిహారం లబిస్తుంది అని అన్నారు. క్రాప్ లోను తీసుకోని ప్రతి రైతు వరి పంటకు ప్రతి ఎకరాకు రూ.800 తమకు దగ్గరలోని సిఎస్‌సి సెంటర్‌కి వెళ్లి ప్రీమియం చెల్లించి రసీదు తీసుకోవాలని సూచించారు. పంటల భీమా చేయించుకోవడం వలన ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, పంటకు నష్టం వాటిల్లినప్పుడు, పంటకు నష్టం సంభవిస్తే పంట నష్టపరిహారం పొందాలంటే పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏలు రఘు మీనా, రసూల్ పాల్గొన్నారు.



ఎసి కంప్రెసర్ నుంచి మంటలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఎసి కంప్రెసర్ పేలిన ఘటన అవనిగడ్డలో మంగళవారం చోటుచేసుకుంది. అవనిగడ్డ స్టేట్ బ్యాంకు రోడ్డులోని ఎ1 మార్ట్‌పై నాలుగవ అంతస్తులో ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఉంటున్నారు. ఏసీ కంప్రెసర్ డికంపోస్ అవుతుందని ఏసీ మెకానిక్‌ను పిలిచి సర్వీసింగ్ చేయించారు. ఇది జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే బెడ్ రూమ్‌లోని ఏసీ నుండి మంటలు వ్యాపించి ఫర్నిచర్‌తో సహా పలు వస్తువులు కాలి బూడిదయ్యాయి. అవనిగడ్డ రేపల్లె ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి రిస్క్యూ ఆపరేషన్ నిర్వహించడంతో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు.



క్రీడాకారిణికి స్పోర్ట్స్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడలోని ఎస్‌పిఎస్ స్కూల్‌లో చదువుతున్న డి.వినీషా ఖోఖో క్రీడాకారిణి 2025-26 సంవత్సరంలో అత్యున్నత ప్రతిభ కనబరించి స్పోర్ట్స్ స్కాలర్షిప్ రూ.50 వేలు అందజేసినట్లు ఖోఖో సంఘం అధ్యక్షుడు మడక ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గన్నవరం జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో జరిగిన హెచ్‌సిఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా స్కాలర్షిప్ పంపిణీ జరిగినట్లు ఈ క్రీడలలో వినీషాను ఖో-ఖో సంఘ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కార్యదర్శి మద్దినేని సత్యప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, పాఠశాల సిబ్బంది అభినందించారు.



సరోజాదేవి మృతికి సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ: సినీ నటి బి.సరోజా దేవి మృతికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంతాపం తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరులో తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకష్ణదేవరాయ పురస్కారాన్ని సరోజాదేవికి అందించే అవకాశం తనకు కలిగిందన్నారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చినముత్తేవి పిఎసిఎస్ అధ్యక్షునిగా కొసరాజు



ప్రజాశక్తి-మొవ్వ: చినముత్తేవి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షునిగా కొసరాజు ప్రకాష్ మాధుర్ (పెదముత్తేవి)ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సిఫార్సుతో ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో డైరెక్టర్లుగా మురారి శివ నాగరాజు (కొండవరం), సుంకర వెంకటేశ్వరరావు (చినముత్తేవి) లను నియమించింది.

మధ్యవర్తిత్వంతో కేసులకు సత్వర పరిష్కారం : జడ్జి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రజల మధ్య చోటుచేసుకునే చిన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా ఆరవ అదనపు జడ్జి పాండురంగారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల న్యాయ సేవ అధికార కమిటీ ఆధ్వర్యంలో మధ్యవర్తత్వం దేశం కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని ద్వారా కాలము ఖర్చు ఆదావుతుందని, దీనితో ఫిర్యాదుదారులకు ఉపశమనం కలగడంతో పాటు త్వరితగతిన సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కొందరు తేలికగా పరిష్కారం అయ్యే సమస్యలను కోర్టుల వరకు పోయి ఇబ్బందులకు గురవుతున్నారని, దీని ప్రభావం కుటుంబ సభ్యుల మీద కూడా పడుతుందన్నారు. అందువల్ల ప్రతి ఫిర్యాదుదారుడు ఆలోచించి వివాదాలను మధ్యవర్తత్వం ద్వారా పరిష్కరించుకోవాలని జడ్జి కోరారు. ఈ సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనక రఘురాం ప్రసాద్ అధ్యక్షత వహించగా పిడిఎం కోర్టు జడ్జి వి స్వర్ణలత, ఎంపీపీ తుంగల సుమతీదేవి, తాసిల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మరియాదేవి, ఏజిపి నరహరిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సత్యబాబు

సంక్షేమ పథకాల అమలులో కూటమి మోసం: సిపిఎం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కూటమి ప్రభుత్వం 13 నెల కాలం పూర్తయిన కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయకుండా కాలయాపన చేయడం అన్యాయమని సిపిఎం ఫ్లోర్ లీడర్ బి.సత్యబాబు కొత్త పేటలోని మోటార్ హనుమంతరావు భవన్‌లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, మత్స్య, గీత, నేత, మంచం పట్టిన రోగగ్రస్తులు, 50 సంవత్సరాలు నిండిన బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ తరగతులకు చెందిన సుమారు పది లక్షల మంది పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. సంపద సృష్టి అంటే పేదల కడుపు కొట్టి 13 నెలపాటు పెన్షన్లు మంజూరు చేయకుండా వారిని క్షోభకు గురి చేయడమా అన్నారు. పెన్షన్ పొందుతున్న భర్త మరణిస్తే ఆ పెన్షన్ కుటుంబంలో భార్యకు ఇచ్చే ప్రక్రియ గత జూన్ 12వ తేదీ ఏడాది పాలనకు సంబరాల పేరుతో ఇస్తామని జాబితాలు ప్రకటించి నేటికీ అమలు చేయలేదన్నారు. జూన్ జూలై పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలని, సదరం మెడికల్ సర్టిఫికెట్లు మంజూరు ప్రక్రియ ప్రతి నెల రెగ్యులర్‌గా జరగాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి

ఒక్క చిత్రంలో ఎన్నో భావాలు...

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : వెయ్యి మాటల్లో చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రంలో చూపించవచ్చని హిందూ హైస్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. డ్రమటిక్ అసోసియేషన్, ఎస్.ఎస్.ఎస్. విభాగం, కె.ఎం.టి అకాడమి ఆఫ్ విజన్ సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు 'ఫోటోగ్రఫీ' అంశంపై నిర్వహించనున్న వర్క్ షాప్ సోమవారం కెబిఎన్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వి.నారాయణరావు మాట్లాడుతూ కళ్ళు కనిపెట్టలేని సున్నిత దృశ్యాలను కెమేరా కన్ను పసిగడుతుందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతకు ఫోటోగ్రఫీ నైపుణ్యం తోడైతే అద్భుతమైన చిత్రాలు తీయడం సాధ్యమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగం ప్రస్తుత సమాజంలో కేవలం కళగా మాత్రమే కాకుండా పరిశ్రమగా, ఉపాధిగా కూడా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు చక్కటి ఉపాధి అవకాశాలు కూడా పొందొచ్చన్నారు. రిసోర్స్ పర్సన్ కె.దీనారాజు ఫోటోగ్రఫీలో ప్రాథమిక అంశాలు, మెలకువలు, నైపుణ్యాలు, డిజిటల్ కెమెరాల వినియోగం, సహజసిద్ధమైన సన్నివేశాల చిత్రీకరణలో అవలంబించాల్సిన పద్ధతులు, ఫోటోలు తీయడంలో ఉండాల్సిన శ్రద్ధ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోటోలో కథనాన్ని ఎలా చెప్పాలి, చిత్రీకరణలో దృష్టి పెట్టాల్సిన అంశాలేమిటి, కళ్ళతో చూడటమే కాకుండా కెమెరా కంటితో చూడటం ఎలా అనే అంశాలపై విశ్లేషణాత్మకంగా వివరణ ఇచ్చారు. డ్రమటిక్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.పవన్ కుమార్, ఎన్.సాంబశివరావు, ఎం.శాంతిబాబు, పి.గౌతమీదేవి పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్.శ్రీనివాస్

ప్రజాశక్తి - తిరువూరు : ముఠా కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరువూరులోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జి.వెంకటరావు, మట్టగుంజ బాబు అధ్యక్షతన ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాలుగో మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలైనా నేటికీ ప్రభుత్వాలు ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ముఠా కార్మికులకు కేరళలోని సిపిఎం ప్రభుత్వం సంక్షే మ బోర్డు ఏర్పాటు చేసి అనేక సంవత్సరాలుగా సేవ చేస్తున్నదన్నారు. కానీ మన రాష్ట్రంలో పాలక పార్టీలు ఎవరు అధికారంలో ఉన్న హామీలే తప్ప ఆచరణ లేదన్నారు. ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పా టు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగు ణంగా కూలి రేట్లు పెంచాలని, ముఠా సాంప్రదాయాలను కాపాడాలని, సివిల్ సప్లైలో నగదు బదిలీ పథకాన్ని ఉపసంహరించాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎస్వీ భద్రం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అన్నిరకాల కార్మికుల ముఠాలను ఐక్యం చేయాలని కోరారు. మహాసభ ప్రారంభ సూచికంగా సిఐటియు పతాకాన్ని యూనియన్ జిల్లా నాయకులు డి.రామారావు ఎగురవేశారు. మహాసభలో ముఠా వర్కర్స్ యూనియన్ విజయవాడ నగర మాజీ అధ్యక్షులు పక్కుతి ఎరకయ్య చిత్రపటానికి ఎస్వీ.భద్రం పూల మాలవేసి నివాళులర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక : ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, అధ్యక్షులుగా ఎం.సీతారాములు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.నరసింహులు, జి.వెంకట్రావు, ఎం.ఇజ్రాయిల్, ప్రధాన కార్యదర్శిగా మట్టగుంజ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈ.వి.నారాయణ సంయుక్త కార్యదర్శులుగా సిహెచ్.దాసు, ఈశ్వర్ కోశాధికారిగా కడిమెళ్ల శ్రీనివాసరావుతో పాటు మరో 17 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వర్లు, నాయకులు ఆకుల రవి, ఎం.చింతయ్య, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : ఖరీఫ్ – 2025లో మిర్చి, మొక్కజొన్న, పెసర, పత్తి పంటల సాగు చేయటంతో పాటు పంటల ప్రీమియం చెల్లించిన రైతులకు మాత్రమే పంటల బీమా పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ పత్తి పంట ఎకరానికి 1900, మిర్చి ఎకరానికి 1800, మొక్కజొన్న ఎకరానికి 370, పెసర పంటకు ఎకరానికి 360, వరి పంటకు ఎకరానికి 850 రూపాయలు చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు విధిగా పంటల ప్రియమైన చెల్లించి పథకాలను రూపొందించాలని సూచించారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని ముండ్లపాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు శక్తి యాప్, గుడ్డు టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్‌కు సంబంధించి ఏఎస్ఐ హనుమాన్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులపై సమాజంలో జరుగుతున్న దాడులు వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. శక్తి యాప్ ఎలా ఉపయోగించాలి ఉపయోగపడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరికపై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - వత్సవాయి : జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హరికపై టిడిపి జనసేన శ్రేణులు దాడి చేయడం పిరికిపంద చర్య అని జగ్గయ్యపేట వైసిపి సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హరికపై దాడికి నిరసనగా మండలంలోని పెంట్యాల వారి గూడెం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తన్నీరు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన మహిళపై ఇలా దాడులకు పాల్పడటం, అసభ్యకరమైన పదజాలాలతో తిట్టడం కూటమి నాయకుల దుశ్చర్యలకు నిదర్శనం అన్నారు. మహిళలపై దాడులకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు. హరిక దంపతులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి రవి, రైతు విభాగజిల్లా అధ్యక్షుడు ఏలూరు శివాజీ, నియోజకవర్గ అధ్యక్షుడు కనగాల రమేష్, ఎంపిపి గొలుసు రమాదేవి, కొట్టె నగేష్, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాటేపల్లి రవికుమార్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఎన్ వెంకటేష్, ఎం నరేష్, బాజీ, రాజేష్ పాల్గొన్నారు.

10వ మహాసభను జయప్రదం చేయండి


కరపత్రాలతో సుప్రజ, సుధాకర్, అంగన్వాడీ వర్కర్లు

ప్రజాశక్తి - మైలవరం : నందిగామలో జరిగే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.సుప్రజ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల పరిస్థితి దయనీయంగా ఉందని ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప అంగన్వాడీల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజులు చేసిన సమ్మె ఫలితంగా 11 డిమాండ్లకు ప్రభుత్వం మినిట్స్ ఇచ్చిందని కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోవడంలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని కూటమి ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు పుష్పకుమారి, శారద, రెడ్డిగూడెం సెక్టార్ లీడర్స్ కుమారి, అరుణ, జి.కొండూరు, ఇబ్రహీంపట్నంసెక్టార్ లీడర్లు విజయలక్ష్మి, మాణిక్యం, నిర్మల, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.



షేక్ రాజా ఆస్పత్రిలో టిబి ముక్తి అభియాన్

ప్రజా శక్తి - విజయవాడ సిటీ : కొత్తపేట షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ ఆసుపత్రి టిబి విభాగం ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి టిబి ముక్తి భారత్ అభియాన్ ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. కొత్తపేట డౌన్ యుపిహెచ్‌సిలో వించిపేట యుపిహెచ్‌సిలో డాక్టర్ పద్మ నాగేంద్రరావు సమక్షంలో మంగళవారం సిపైటిబి టెస్టులు నిర్వహించారు. ప్రతి యుపిహెచ్‌సి సెంటర్‌లో 20 టెస్ట్‌లను చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తపేట టిబి యూనిట్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి మైలవరం : లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు చనుమోలు నాగభూషణం కుమార్తె గ్రీష్మిత పుట్టినరోజు సందర్భంగా మైలవరం కోర్టు ప్రాంగణంలోని ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు మంగళవారం నోటు పుస్తకాలు, పెన్సిళ్ళు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు ఎస్ఐలు సుధాకర్, మోహనరావు, సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చూస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్ క్యాబినెట్ మెంబర్ డాక్టర్ సిహెచ్.బాలగోపాల్ రెడ్డి, శ్రీధర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఏ జి పి రెడ్డి ప్రసాద్, సీనియర్ లైన్ మెంబర్లు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - మైలవరం : ఈనెల 23, 24 తేదీల్లో గుంటూరులో జరుగుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ధరణికోట శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక భవన నిర్మాణ కార్మికుల భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరులో జరిగే మహాసభలో సంక్షేమ బోర్డు సంరక్షణ కోసం భవిష్యత్తు కార్యాచరణలను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధు శ్రీనివాసరావు, ధరణికోట వెంకటేశ్వరరావు, దుర్గారావు, నాగమల్లేశ్వరరావు, ఆంజనేయులు, గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన... పట్టని పాలకులు



ప్రజాశక్తి-గన్నవరం: మండలంలోని కేసరపల్లి నుండి కంకిపాడు వెళ్లే రోడ్డులో కాలువపై బ్రిటీషు పాలకుల కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దశబ్దాలుగా ఈ వంతెన కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం కారణంగా కూలిపోయే స్థితికి చేరుకుంది. వంతెనపై రెయిలింగ్ దెబ్బతి నడంతో పాటు పిచ్చిమొక్కలు మొలిచి గోడలు బీటల వారాయి. దీనికితోడు పరిమితికి మించిన లోడుతో భారీ వాహనాలు వంతెనపై రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సుమారు వందేళ్ల క్రితం గానుగసున్నం, రాతిరాయితో ఈ వంతెనను నిర్మించారు. కేసరపల్లి వద్ద జాతీయ రహదారి బైపాస్ నిర్మించక ముందు విజయవాడ-ఏలూరు మధ్య వాహనాలు ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం గన్నవరం నుంచి కేసరపల్లి మీదుగా ఉప్పులూరు, తెన్నేరు, మంతెన, పునాదిపాడు, కంకిపాడు వెళ్లేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుంది. అంతే కాకుండా కేసరపల్లి రైతులు ఏలూరు కాలువ అవతల పంట పొలాలకు వెళ్లేందుకు, పండించిన పంటలను గ్రామానికి తీసుకొచ్చేందుకు ఈ వంతెన ప్రధాన ఆధారం. గతంలో కృష్ణానది పుష్కరాల సమయంలో కంకిపాడు-కేసరపల్లి మధ్య ఆర్అండ్బ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించిన ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని మాత్రం విస్మరించింది.

భయంభయంగా ప్రయాణం

శతాబ్ద కాలం క్రితం నిర్మించిన ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు 30 నుంచి 40 టన్నుల సామర్థ్యం కలిగిన ఇసుక, గ్రావెల్ టిప్పర్లు, ధాన్యం లోడు లారీలు కూడా ఈ వంతెనపై వెళుతున్నాయి. కొత్త వంతెన నిర్మాణానికి 35 నుంచి 40 కోట్లు కావాల్సి ఉందని అధికారులు అంటున్నారు. భారీ లోడు లారీలు వెళ్లడంతో పునాదులు బలహీనపడుతుండడంతో పాటు వంతెన గోడలు కూడా క్రమంగా దెబ్బతింటున్నాయి. ఆర్అండ్ బీ శాఖ కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం కారణంగా వంతెన క్రమంగా దెబ్బతిం టుంది. వంతెన గొడలకు, రెయిలింగ్పై పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. ఇరుకుగా ఉండే ఈ వం తెనపై ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకుని వెళ్లే పరిస్థితి కూడా లేదు. శిథిలావస్థకు చేరుకున్న వంతెన ఏక్ష ణంలో కూలుతుందోననే భయంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. పాత వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని పలు మార్లు ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వంతెన పునర్నిర్మాణం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎండుతున్న వరి పైరు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని వడ్లమన్నాడులో వరి పైరు ఎండిపోతుంది. ఈ గ్రామ పరిధిలోని రెండు వేల ఎకరాల్లో ఈ పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో వడగాలులతో కూడిన మండుటెండలు వల్లనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. సాగునీరు ఎంత ఉన్నా వర్షాకాలంలో కురవాల్సిన వానలు కురవక వడగాలులు వేయటంతో పచ్చగా ఉండాల్సిన వరి పైరు ఎర్రబారుతుంది. ఈ విపత్తుకు రైతులు ఏమి చేయలేని దుస్థితిలో దిక్కుతోచకుండా ఉన్నారు.

'నిందితులను అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి-గన్నవరం

ఉమ్మడి కృష్ణాజిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి సంఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని గన్నవరం ఎస్ఐకి వినతిపత్రం అందించినట్లు గన్నవరం జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి తెలిపారు. అలాగే ఎస్పి కూడా వినతిపత్రం పంపించినట్లు తెలిపారు. పోలీసులు అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి అరెస్టు చేయట్లేదని ప్రజలు భావిస్తున్నారని ఆమె తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : చండిక

ప్రజాశక్తి-చల్లపల్లి

స్థానిక నారాయణరావు నగర్లో ఎంపి మోడల్ పాఠశాలను డైట్ అధ్యాపకులు చండిక వేణుగోపాల్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. అనంతరం టాయిలెట్స్ శుభ్రత, విద్యార్థుల స్థాయి, యూనిఫారం పంపిణీ, బూట్లు, బాగ్స్ మొదలైనవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని-1, 2 కె.సుజాత, పరిసే వెంజటేశ్వరావు, చల్లపల్లి క్లస్టర్ హెచ్ఎం ఎం.రాజా, ప్రధానోపాధ్యాయులు కైతేపల్లి దాస్ పాల్గొన్నారు.

చల్లపల్లి ఆసుపత్రిలో ఎక్స్రే సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లిలోని కస్తూరిబా మెమోరియల్ 30 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రూ.10 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఎక్స్-రే యంత్రాలు, ఒక కంప్యూటెడ్ రేడియోగ్రఫీ మిషన్ సేవలను అవనిగడ్డ శాసనమండలి సభ్యులు మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఆసుపత్రి మెడికల్ వ్యర్థముల నిల్వకు ఏపీ ఎంఐఎస్ డీసీ నిధులతో నిర్మించిన బయో మెడికల్ వేస్ట్ గదులను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ప్రసూతి వార్డు, జనరల్ వార్డు, క్యాజువాలిటీల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు అందచేశారు. ఆసుపత్రిలో పాము కాటు బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆసుపత్రిని యాభై పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 120-150 మంది రోగులకు ఓపీ సేవలు అందిస్తున్నారన్నారు. ఈ ఆసుపత్రిలో గుండెపోటు నివారణకు అవసరమైన అత్యవసర ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమ, డాక్టర్ ఉమా మహేష్, డాక్టర్ దుర్గా శైలజ, డాక్టర్ వంశీ రామకృష్ణ పవన్, ఫిజియోథెరపీ డాక్టర్ వంశీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

బిబిగూడెం సొసైటీ అధ్యక్షునిగా మురళీకృష్ణ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం బిబి గూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా బోయపాటి మురళీకృష్ణ (బుల్లియ్య) మరోసారి నియమితులయ్యారు. గత 12 సంవత్సరాలుగా ఆయనే సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రారంభంలో 70 లక్షల అప్పుతో ఉన్న సొసైటీని క్రమంగా అభివృద్ధి చేస్తూ డిపాజిట్లు సేకరించడంతో పాటు ఎరువుల వ్యాపారాన్ని పెంచారు. ధాన్యం వ్యాపారం చేశారు. ప్రస్తుతం 60 లక్షలు మిగులు ఉండేలా వృద్ధిరేటు సాధించారు. రైతుల అవసరాలను పూర్తిగా తీర్చడంలో ఆయన సఫలీకృతమయ్యారు. బీబీ గూడెం, చిక్కవరం, గొల్లనపల్లి గ్రామాలు ఈ సొసైటీ పరిధిలోకి వస్తాయి. వందలాది ఎకరాల సాగు ఉంది. పెద్ద రైతులతో పాటు చిన్న, సహకార రైతులు ఉన్నారు. వారందరికీ సకాలంలో రుణాలు అందించడం ద్వారా చేయూత అందిస్తున్నారు. అదేవిధంగా రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి మద్దతు ధర వచ్చేలా చూస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వాలు మారినా ఆయన మీద ఉన్న నమ్మకంతో కొత్తగా వచ్చిన పాలకులు బుల్లియ్యను సొసైటీ అధ్యక్షులుగా కొనసాగిస్తున్నారు. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యే యార్లగడ్డ కూడా ఆయన పేరును ప్రతిపాదించడంతో మళ్లీ సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం తహశీల్దారు కార్యాలయంలో గన్నవరం నియోజకవర్గ ఇఆర్ఓ టి.శివరామప్రసాద్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి ఓటర్ల తాజా పరిస్థితి, పోలింగ్ బూత్ల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా శివరామప్రసాద్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 2,80,109 మంది ఓటర్లుగా నమోదయ్యారని, విజయవాడ రూరల్ మండలంలో 89,370 మంది, గన్నవరం మండలంలో 74,700 మంది, బాపులపాడు మండలంలో 72,120 మంది, ఉంగుటూరు మండలంలో 43,919 మంది ఓటర్లుగా నమోదయ్యారని చెప్పారు. గత సాధారణ ఎన్నికల నాటికి నియోజకవర్గంలో 306 పోలింగ్ స్టేషన్లు వుండగా రాజకీయ పార్టీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు బాపులపాడు మండలం, కాకులపాడు గ్రామం నుంచి విడగొట్టి రంగయ్యప్పారావుపేట గ్రామానికి ప్రత్యేకంగా 240 నెంబరుతో కొత్తగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామని తెలియజేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి కొత్తగా 1200 ఓట్లు మించిన 20 పోలింగ్ స్టేషన్లు రెండుగా విభజించటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని 12 పోలింగ్ స్టేషన్లను విశాలమైన భవనాల్లోకి మార్చటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని నాలుగు పోలింగ్ స్టేషన్లు పేర్లు మార్చటానికి ప్రతిపాదించామని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు చిమటా రవివర్మ (జనసేన), తంగిరాల శ్రీనివాసరావు (టిడిపి), సిహెచ్.వెంకటేశ్వరరావు (సిపిఐ.), తహశీల్దారు కె.వి.శివయ్య, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు కె.లక్ష్మీనాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.





పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: జిల్లాలో ప్రతి గ్రామానికి పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తోటమూల గ్రామంలో వ్యవసాయ పొలాలనమాయన మంగళవారం సందర్శించారు. ఆ ప్రాంతంలో సాగునీరు గత 20 రోజులుగా లేకపోవడం వల్ల వరి పొలాలు దెబ్బతింటున్నాయని, మచిలీపట్నం మండలంలోని బుద్దాలపల్లి గ్రామంలో కూడా పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడం వల్ల వరి పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే పెడన నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు, మచిలీపట్నంలోని బుద్దాలపాలెం, పెదపట్నం కానూరు తదితర గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలని కోరారు. కాంప్లెక్స్ ఎరువులు, యూరియా ఎరువులు కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సహకార సంఘాల ద్వారా, ఇతర ఎరువుల దుకాణాల ద్వారా రైతులకు, కౌలు రైతులకు ఇబ్బందులు లేకుండా అందించాలని, అధిక ధరలు అమ్మే షాపులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముక్కు రాంబాబు, ముక్కు నాగమణి, వాలిశెట్టి నాగేంద్రరావు, కొక్కు బాలాజీ, కొక్కు వెంకటేశ్వరరావు, వరికుట్టి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం అధునాతన కూలింగ్ వాటర్ ప్లాంట్ను ప్రారంభించారు. దేవస్థానమునకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం 500 లీటర్లు సామర్థ్యం కలిగిన కూలింగ్ ప్లాంట్ను దేవస్థానం తరపున ఏర్పాటు చేయడం జరిగినదనీ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు.



నేడు స్మార్ట్మీటర్లపై రౌండ్టేబుల్

ప్రజాశక్తి-గన్నవరం: స్మార్ట్ మీటర్లు, పెరిగిన కరెంటు బిల్లులకు వ్యతిరేకంగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆంజనేయులు తెలిపారు. ఈ సమావేశంలో విద్యావంతులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు: దుర్వసనాలకు అలవాటు పడితే శిక్షకు గురవుతారని ఉంగుటూరు ఎస్ఐ యు.గోవింద్ అన్నారు. మండలంలోని ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేటి సమాజంలో అవగాహనా లేమితో యువత సోషల్ మీడియాని ఉపయోగించి తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, దాని ప్రభావంతో సిగరెట్, మద్యం లాంటి దుర్వసనాలకు లోనవుతున్నారని తెలిపారు. బాలికలు ఒంటరిగా ఉన్నప్పుడు ఏదైనా ప్రమాదం సంభవిస్తే మొబైల్ ద్వారా శక్తి యాప్ను ఉపయోగించుకుని పోలీసులకు సమాచారం అందించి రక్షణ పొందవచ్చన్నారు.

ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-మొవ్వ: పామర్రు నియోజకవర్గ టిడిపి కార్యాలయం వద్ద మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన చిలిమూరి విజయ్బాబుకు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతుల మీదుగా బ్యాటరీ ఛార్జింగ్ ట్రై సైకిల్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, కొక్కిలికడ్డ బ్రూస్లీ, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

గానుగపాడు, కొత్తూరులో పొలంపిలుస్తోంది

ప్రజాశక్తి - తిరువూరు : ఖరీఫ్ వరిలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని తిరువూరు మండల వ్యవసాయ అధికారి పి.పద్మ సూచిం చారు. పొలం పిలుస్తోంది కార్య క్రమంలో భాగంగా మండలంలోని గానుగపాడు జి.కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు ఖరీఫ్ వరిలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు వివరించారు. వరిలో కలుపు నివారణ ఎరువుల వినియోగం నీటి యాజమాన్యం సక్రమంగా అనుసరిస్తే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని ఏవో తెలిపారు. ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకం కింద వరి సాగుచేసిన రైతులు రూ.850ల పంటల బీమా ప్రీమియం ఆగస్టు 15 లోపు చెల్లించాలని కోరారు. పత్తిలో రసం పీల్చు పురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అన్నదాత సుఖీ భవ పథకానికి అర్హత కలిగి అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు ఆయా గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో అర్జీ ఇవ్వాలని పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జి.అరుణ్ కుమార్ గ్రామ పెద్దలు వేమిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్ వెంకటేశ్వర్ రావు సూర్యనారాయణ రైతులు పాల్గొన్నారు.



నారుమడి, వరి నాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జూపూడి, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి యడవల్లి రజిని పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరి నారుమడి, వరినాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నారుమడి యాజమాన్య పద్ధతులు రైతులకు వివరించారు. నాట్లు వేయడానికి ఒక వారం ముందు 3 గ్రాముల గుళికలు వేసుకోవాలని రైతులకు తెలిపారు. తద్వారా ప్రధాన మడిలో కాండం తొలుచు పురుగును అరికట్టవచ్చని, ప్రధాన పొలం తయారీ సమయంలో సేంద్రియ ఎరువుల్ని వాడవల్సిందిగా రైతులకు సూచించారు. ప్రధాన మడిలో నారు నాటే ముందు చివరిలో తుంచి నాటడం వల్ల మొక్క చివర్లో కాండం తొలుచు పురుగు గుడ్లను తొలగించి, ప్రధాన మడిలోకి పురుగు ఉధృతి తగ్గించవచ్చన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం వివిధ పంటలకు వివిధ రకాలుగా ఉందని తెలిపి, పత్తి, మొక్కజొన్న పెసరకు మంగళవారం ఆఖరి రోజు అని రైతులకు తెలిపారు. రైతులందరూ నిర్ణీత సమయంలో ఇన్సూరెన్స్ కట్టుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూపూడి గ్రామ రైతులు, ఇబ్రహీంపట్నం గ్రామ రైతులు గ్రామ వ్యవసాయ సహాయకురాలు వాసవి పాల్గొన్నారు.

ఎస్‌విఎస్ కళాశాల పూర్వ పీడీ మృతికి సంతాపం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఎస్‌విఎస్ కళాశాల పూర్వ పిడి శౌంఠి వెంకటేశ్వరరావు (85) మంగళవారం మృతి చెందారు. ఆయన కొన్ని సంవత్సరాలుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన మృతి పట్ల ఎస్‌జి ఎస్ కళాశాల పూర్వ అధ్యాపకులు, పూర్వ ప్రిన్సిపాల్స్, పాలకవర్గం సంతాపం తెలిపారు.

ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నందిగామ సబ్ డివిజన్ పరిధిలో పట్టణంలోని లైఫ్ హిల్స్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్‌లో నందిగామ ఎసిపి ఎపిజి తిలక్ సూచనల మేరకు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని శక్తి బృందం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగ దుష్పరిణామాలపై విద్యార్థులు, యువత, సామాన్య ప్రజల్లో చైతన్యం కలిగించారు. మహిళలపై వేధింపులు ఎలా గుర్తించాలి, బాధితులు పోలీసులను ఎలా సంప్రదించాలి, ర్యాగింగ్, డ్రగ్స్ వల్ల జరిగే నష్టం, శక్తియాప్ ఉపయోగం, వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన పోస్టర్లు పంపిణీ చేసి, విద్యార్థులతో ముఖాముఖీ చర్చలు నిర్వహించి శక్తి యాప్‌పై డెమో ఇచ్చారు. **నందిగామ :** మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి సమస్యలపై అవగాహన ఉండాలని నందిగామ ఎస్సై అభిమన్యు పేర్కొన్నారు. నందిగామ సబ్ డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో గవర్నమెంట్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, నందిగామలో మహిళ భద్రత, శక్తి యాప్ వాడకంపై, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్ ఉపయోగాలు అత్యవసర పరిస్థితుల్లో మహిళలు


నందిగామలో మాట్లాడుతున్న ఎస్ఐ అభిమన్య

112 లేదా శక్తి యాప్ ద్వారా సత్వరంగా పోలీసులను సంప్రదించగలిగే విధానం, లొకేషన్ ఆధారంగా స్పందన వ్యవస్థ ఎలా పనిచేస్తుందో వివరించారు. సహాయ నంబర్లు పోలీసు సపోర్ట్ 100, 112, 1930 హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యత, ఎప్పటికప్పుడు ఉపయోగించగలిగే విధంగా వాటిని సేవ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్దఎత్తున పాల్గొని, ప్రశ్నల ద్వారా చురుకుగా స్పందించారు. చివరగా, శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసి ఉపయోగించే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించి అవగాహన కల్పించారు.

తాగునీటి వ్యవస్థ అభివృద్ధికి రూ. 11.27 కోట్లు : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా వ్యవస్థను అభివద్ధి చేయడం కోసం అమత్ 2.0 స్కీమ్ కింద రూ.11.27 కోట్లు ప్రత్యేక గ్రాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే రాజగోపాల్ నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం జగ్గయ్యపేటకు కృష్ణా నది నుండి రోజుకు 6 నుండి 7 ఎంఎల్డీ (ఎంఎల్‌డి) ముడి నీటిని అందిస్తున్నామని, ఈ కొత్త ప్రాజెక్ట్ ద్వారా రోజుకు 12 ఎంఎల్డీ (ఎంఎల్‌డి) వరకు నీటిని తీసుకురావడానికి ఏర్పాట్లు జరుగనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 500 కెవి (కెవి) విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తగా ఏర్పాటు, కొత్త పంప్, 1000 కె ఎల్ సామర్థ్యం గల కొత్త ఈ ఎల్ ఎస్ ఆర్ (ఎలివేటెడ్ వాటర్ ట్యాంక్), కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా టిడ్కో గృహాల విస్తరణ ప్రాంతం, ఎల్పి 1 లేఅవుట్ వరకు తాగునీటి పైపులైన్లను విస్తరించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, గొట్టే నాగరాజు, పేరం సైదేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ నాయకులు మోటూరి మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ప్రముఖ ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు మోటూరి పూర్ణచంద్రరావు (81) హైదరాబాదులో ఆదివారం ఆకస్మికంగా మరణించారు. వీరి మరణానికి ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి లోని అప్మెల్ కంపెనీ పూర్వపు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం ప్రభుత్యం, కె.వి నాగేశ్వరరావు, పి శివ నాగేశ్వరరావు, పూర్వపు అధికారుల సంఘం నాయకులు పెట్ల కామేశ్వరరావు, కొండపల్లి పట్టణ సిఐటియు కమిటీ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా పెట్ల కామేశ్వరరావు మాట్లాడుతూ మోటూరు పూర్ణచంద్రరావు హైదరాబాద్ నగరానికి 1970 నుండి 10 సంవత్సరాలు సిఐటియు ప్రధాన కార్యదర్శిగా పని చేశారన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కార్మిక వర్గ నాయకత్వం అభివృద్ధి చెందటానికి కృషి చేశారన్నారు.ాలుగు సంవత్సరాల వరకు ఉండే వేతన ఒప్పందం 3 సంవత్సరాలకు కుదించేలా చేశారన్నారు. ఉద్యోగుల ప్రమోషన్స్‌కు అవకాశం లేని వారికి అదనపు ఇంక్రిమెంట్‌లు అందేలా కృషి చేశారన్నారు. మోటూరు పూర్ణచంద్రరావు ఆకస్మిక మృతికి అప్మెల్ పూర్వపు ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, అప్మెల్ పూర్వ అధికారుల సంఘం సభ్యులు కొండపల్లి పట్టణ సిఐటియు సభ్యులు సంతాపం తెలిపారు.

హైస్కూల్‌కు పట్టాలు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శ్రీ వాసవి సేవా సమితి జిల్లా జగ్గయ్యపేట వారి ఆధ్వర్యంలో పట్టణంలో గెంటేల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థులు స్కూల్ అసెంబ్లీ, ఇతర కార్యక్రమాల సమయంలో నేలపై కూర్చునేందుకు వీలుగా మంగళవారం వాసవి సేవా సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు, బియ్యం, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు పేరూరి నరసింహారావు పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం అందచేశారు. 400 మంది పిల్లలు కూర్చునేందుకు 8 విలువ చేసే 2 పట్టాలను హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు పారేపల్లి నాగేశ్వరరావుకు అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్తక, వాణిజ్య విభాగం అధ్యక్షులు కొత్తా పురుషోత్తం, జిల్లా వాసవి సేవాసమితి అధ్యక్షులు యన్నాకుల రాంబాబు, ప్రధాన కార్యదర్శి పెనుగొండ రామకృష్ణ కోశాధికారి కంభం పాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. దాత నరసింహారావును హెచ్‌ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

మాజీ సర్పంచ్ భీముడు మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని కన్నెవీడు గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచి ధారావత్ భీముడు (60) గుండెపోటుతో మృతి చెందారు. సాయంత్రం గుండెపోటు రావడంతో ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం కన్నెవీడు తరలించి కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. పిల్లలందరూ వివాహితులే. 2008 నుంచి 2013 మధ్యకాలంలో సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామస్తులందరూ వ్యక్తిగతంగా క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన హయాంలో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, నిర్మించారు. పక్కా గృహాలు కూడా నిర్మించి గ్రామ అభివృద్ధికి తోడ్పడ్డారు.


రోగులను విజయవాడ తరలిస్తున్న దృశ్యం

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వత్సవాయి : జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో భాగంగా ముళ్ళపాడు, ఖమ్మంపాడు, వత్సవాయి, మల్కాపురం, గౌరవరం గ్రామాల్లో ఫౌండేషన్ ద్వారా కంటి శుక్లాల ఆపరేషన్ చేయగా మిగిలిన వారికి కూడా ఆపరేషన్ నిమిత్తం ప్రత్యేక వాహనాల్లో శంకర్ నేత్రాలయం 20 మందిని విజయవాడకు తరలించారు. ముందు జాగ్రత్తగా అందరి ఆరోగ్య పరిశు భ్రత, పరిరక్షణకు శానిటైజర్‌ను, అంటూ వ్యాధులు సోకకుండా మాస్కులను, జయప్రద ఫౌండేషన్ తరుపున కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు అందజేశారు.



రాజీనామా చేసి నిజాయితీని నిరూపించుకోవాలి

ప్రజాశక్తి - నందిగామ : వైసిపి ఎంఎల్‌సి అరుణ్ కుమార్ వ్యాఖ్యలను నందిగామ తెదేపా మునిసిపల్ కౌన్సిలర్లు ఖండించారు. వైసిపి నాయకులు ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ 'తిరిగి అధికారంలోకి రాగానే టీడీపీ కార్యకర్తలను రప్ప రప్ప నరుకుతాం' అంటూ చేసిన అప్రజాస్వామిక వ్యాఖ్యలను మున్సి పల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి, టిడిపి కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు.

మాజీ సర్పంచ్ వేమా జయంతి

ప్రజాశక్తి - కంచికచర్ల : నిస్వార్థంగా ప్రజా సేవ చేసిన మహనీయులు దశాబ్దాలు గడిచినా ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోతారని విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత, కంచికచర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గంగిరెడ్డి రంగారావు పేర్కొన్నారు. కంచికచర్ల మాజీ సర్పంచ్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ వేమా నరసింహారావు 94వ జయంతి వేడుకలు మంగళవారం కంచికచర్ల నెహ్రూ సెంటర్లో పట్టణ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమా నరసింహారావు విగ్రహానికి గంగిరెడ్డి రంగారావుతో పాటు పట్టణ ప్రముఖులు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఇంజనీరింగ్ కార్మికులకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు అండగా నిలబడాలని రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు మంగళవారం మచిలీపట్నం బుట్టాయిపేటలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గత 20 రోజులుగా ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె చేస్తుంటే వారికి మద్దతుగా నిలబడాల్సింది పోయి ఏఐటీయూసీ యూనియన్ ప్రభుత్వానికి వెసులుబాటు కల్పించే విధంగా ఉద్యమాన్ని నీరు గార్చే ప్రయత్నాలు చేయడం దారుణం అన్నారు. నగరపాలక సంస్థల్లో పని చేసే ఇతర విభాగాల కార్మికులు కూడా ఇంజనీరింగ్ కార్మికులకు అండగా నిలబడటం సంతోషకరమైన విషయం అన్నారు. ఇప్పటికే నందిగామ ఇబ్రహీంపట్నం తదితర మున్సిపాలిటీల్లో ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో పాల్గొంటున్నారని ఇతర కార్మిక వర్గాలు వారికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కనీస వేతనం నెలవారి 26 వేలకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఈఎస్ఐ ఆరోగ్య బీమా తదితర సదుపాయాల కోసం పట్టుదలగా సమ్మెలో పాల్గొన్న ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా అన్ని నగరపాలక సంస్థల పరిధిలో కార్మికుల సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మచిలీపట్నం నగరపాలక సంస్థలో కూడా ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో పాల్గొనే విధంగా సమావేశానికి హాజరైన ఇంజనీరింగ్ కార్మికులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మచిలీపట్నం సిఐటియు నగర కన్వీనర్ బూర సుబ్రహ్మణ్యం, వివిధ వర్గాల కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-గన్నవరం

వీరపనేనిగూడెంలోని పిఎస్ఆర్ కంపెనీలో సీలింగ్ రిపేర్ చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. గొల్లనపల్లి గ్రామానికి చెందిన కర్రే రామ లక్ష్మణ్ (32) సీలింగ్ రిపేర్ నిమిత్తం తోటి వర్కర్స్‌తో కలిసి షెడ్ రేకుల పైకి ఎక్కి పని చేస్తుండగా పొరబాటున ఫైబర్ షీట్‌పై కాలు మోపడంతో అది విరిగి సుమారు ముప్పై అడుగుల ఎత్తు నుండి పడిపోయాడు. దాంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. హుటాహుటిన రామ్‌లక్ష్మణ్‌ను పెదవుటపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రిలో చేర్పించగా అప్పటికే చనిపోయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. లక్ష్మణ్ సోదరుని ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాలా సురేష్ తెలిపారు.

లింగ నిర్ధారణను ప్రోత్సహిస్తే చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో ఎవరైనా లింగ నిర్ధారణ కు ప్రోత్సహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్ శర్మిష్ట హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్ శర్మిష్ట మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఎవరైనా, ఆడైనా మగైనా సమానంగా చూడాలన్నారు, మన జిల్లాలో వెయ్యి మంది బాలురకు 951 మంది బాలికలు ఉన్నారన్నారు. కాబట్టి బాలికలను బాలురుతో సమానంగా ప్రోత్సహించాలన్నారు. అలాగే మైనరు బాల బాలికలకు సరియైన వయసులో పెళ్లికి ప్రోత్సహించాలన్నారు. మైనర్ బాలికలు గర్భధారణ వలన మాత శిశు మరణములు సంభవింవచ్చునని ప్రతినెలా డేకాయ్ ఆపరేషన్ చేయాలని, వీటిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ సిహెచ్.రోజా, డాక్టర్ ఐ.వినీల్. డాక్టర్ ఎం.హారిక, డెమో డి.నాగరత్నం, ఎన్జీవోలు ఎం. ధర్మతేజ, కె సుశీల, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రికార్డ్ అసిస్టెంట్‌కు సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం: స్థానిక గన్నవరం మండల పరిషత్ ఆవరణలో గల గ్రంథాలయంలో డిప్యూటేషన్ పై వచ్చి తిరిగి వెళ్తున్న రికార్డ్ అసిస్టెంట్ జె.శంకర్‌ను గ్రంథాలయ అధికారి కె.నాగరాజు, గ్రంథాలయ పాఠకులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలకటం జరిగినది. శాలువాతో సత్కరించి, అభినందలు తెలిపారు. అనతి కాలంలోనే గ్రంథాలయ పాఠకుల మన్నన పొంది మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.నాగరాజు గారు, గ్రంథాలయ పాఠకులు పాల్గొని ఘనంగా వీడ్కోలు తెలిపారు.



వంతుల వారీగా కాల్వలకు నీరు : బండి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

రైతులు సకాలంలో వరి నాట్లు పూర్తి చేసేందుకు అవసరమైతే పంట కాలువలకు వంతుల వారీగా నీటి సరఫరా విధానానికి సహకరించాలని ఉమ్మడి కృష్ణాజిల్లా డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మచిలీపట్నం నార్త్ మండలంలోని అరిసెపల్లి, బోర్రపోతు పాలెం, గొల్లగూడెం, బుద్ధాల పాలెం, కొత్తపూడి, పోతిరెడ్డి పాలెం, పోతేపల్లి గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యల పరిష్కారం కోసం పంచాయతీల వారీగా రైతులతో కలిసి పర్యటించారు. నీటి సంఘాల అధ్యక్షులతో, నీటి సంఘాల సిబ్బందితో, రైతులతో పూర్తిగా చర్చించిన తర్వాత వంతుల వారీగా నీటి వినియోగం జరిగితే చివరి పొలం వరకు నీటిని అందించవచ్చుని ఏకాభిప్రాయానికి వచ్చారు. సదరు విషయమై డిసి మీటింగ్ లో వంతుల వారి విధానంలో భాగంగా రెండు రోజులు బుద్ధాలపాలెం డ్రాప్ వరకు, మూడు రోజులు నందమూరి, జింజేరు, కానూరు పంచాయతీలకు మూడు రోజులు పంట పొలాలకు నీటిని వినియోగించుకునే విధంగా తీర్మానం చేశారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర : కనపర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకే వైసిపి ప్రణాళికబద్ధంగా అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ నేత బోబ్బా అన్నారు. మంగళవారం అవనిగడ్డలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన వారం రోజులుగా మాజీ మంత్రి పేర్ని నాని చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో పెరుగుతున్న పెట్టుబడులు ఉపాధి అవకాశాలు చూసి ఓర్వలేక జగన్ రెడ్డి ప్రాంతానికి ఒక సైకోను రంగంలోకి దింపి అలజడులు రేగేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పరుచూరి దుర్గాప్రసాద్, బండే రాఘవ, బండి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు

పరిశ్రమల ఏర్పాటుకు సహకారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ రాయితీలను కల్పిస్తూ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను కోరారు. మంగళవారం కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో అజెండా అంశాలు, పెండింగ్ దరఖాస్తుల పురోగతి, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తోందని, కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమలకు సంబంధించిన అన్ని అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో తక్షణమే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పార్క్ పాలసీ విధానాన్ని ప్రోత్సహిస్తూ ఇటీవల కొత్త జీవో తీసుకొచ్చిందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ పార్క్ పాలసీ విధానాన్ని ఉపయోగించుకుంటూ బాపులపాడు మండలంలోని వేలూరు గ్రామంలో 40 ఎకరాలలో ఏర్పాటు చేసిన శ్రీ వేద ఇన్నోవేషన్ పార్క్ ప్రతినిధులను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.పరిశ్రమల రంగానికి సంబంధించిన 13 రకాల సేవలను మనమిత్ర-వాట్సాప్ ద్వారా పొందవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

ఫైనాన్స్ బిల్లుపై పెన్షనర్ల ధర్నా



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్‌తో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ అమెండ్మెంట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి రామస్వామి మాట్లాడుతూ ఈ ఫైనాన్స్ బిల్లు అమల్లోకి వస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లే గాక, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కూడా నష్టపోయే అవకాశం ఉందన్నారు. కావున పెన్షనర్స్ అందరు ఈ ఫైనాన్స్ బిల్లును అమలు కాకుండా నిలువరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కేంద్రంలో ఎనిమిదవ పే కమిషన్ వెంటనే నియమించాలని, మన రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే ఐ.ఆర్ ప్రకటించి, పెండింగులో ఉన్న డి.ఆర్. బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఉద్యోగ పెన్షనర్లకు కాంప్రహెన్సీవ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమును అమలు చేయాలన్నారు.కేంద్ర రాష్ట్ర పెన్షనర్ల కమ్యూటేషన్ రికవరీ కాలము 16 సంవత్సరాల నుండి 11 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో పెన్షనర్స్ అసోసియేషన్, ట్రెజరర్ ఏవి ప్రసాదరావు, భవిరి శంకర్నాథ్, బివి సుబ్బారావు, రామకష్ణ, ఏబి అజీజ్, మహమ్మద్ సిలార్, ప్రకాశరావు, వివిధ శాఖలకు చెందిన పెన్షనర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని నిరసన

ప్రజాశక్తి-గుడివాడ: స్మార్ట్ మీటర్లు బిగించవద్దని గుడివాడ పట్టణం ఎన్టీఆర్ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి మంగళవారంం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లను ఆపాలి, బిగించిన స్మార్ట్ మీటర్లు వెంటనే తీసేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రజిని, సురేంద్ర, శనగపాటి నాగేశ్వరరావు, ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఉంగుటూరు: రైతుల సంక్షేమానికి సొసైటీల పాలకవర్గాలు మరింత కృషి చేయాలని గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధన్‌రావు అన్నారు. మండలంలోని ఆముదాలపల్లి పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆముదాలపల్లి పిఎసిఎస్ నూతన చైర్ పర్సన్ దాసరి నాగేంద్రబాబుకు, పర్సన్స్ జంగం జోజి బాబు, తేలు సత్యనారాయణలకు మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధన్ రావు చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు వెంకటరమణ, నీటి సంఘం అధ్యక్షులు దాసరి శ్రీకృష్ణ, సొసైటీ కార్యదర్శి సిహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు. **కంకిపాడు:** పెనమలూరు మండల వ్యవసాయ సహకారం సంఘం అధ్యక్షునిగా కిలారు శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా నెపల్లి హరీష్, ఉప్పులూరు కేశవరావు ఎంపికయ్యారు. వీరికి పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ అభినందనలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ఘంటసాల: రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకపల్లి - జిలగలగండి రోడ్డుపై వాహనదారుల వేగాన్ని తగ్గించేందుకు జిగ్జాగ్ నమూనాలో రేడియం స్టిక్కర్లతో కూడిన ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఇన్స్పెక్టర్ ఈశ్వర్ రావు, ఘంటసాల ఎస్ఐ ప్రతాపరెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. రాత్రి సమయంలో కూడా స్పష్టంగా కనిపించేలా రూపొందించిన ఈ డ్రమ్ములు మితిమీరిన వేగంతో జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ఇంటింటికీ 'సుపరిపాలన'

ప్రజాశక్తి-గుడివాడ : పేద వర్గాల సంక్షేమం రాష్ట్ర అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం పట్టణంలోని 8, 9 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే రాము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు గోకవరపు సునీల్, టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ఎన్‌టిఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నందివాడ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని స్వర్గీయ అన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాము నివాళులర్పించారు. గ్రామంలో వీధి వీధికి వెళ్లిన ఎమ్మెల్యే రాముకు స్థానిక ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ లక్ష్మణరావు, బచ్చు మురళి, గోసాల బాలకోటేశ్వరరావు, బచ్చు నాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు. **కంకిపాడు:** పెనమలూరు గ్రామంలోని కొత్త హరిజనవాడలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు. **పమిడిముక్కల:** గోపువానిపాలెం, తాడంకి గ్రామాల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యార్లగడ్డ భూషయ్య, రాజులపాటి శ్రీనివాసరావు, మైనేని ఇందిరా పాల్గొన్నారు.

రోజు రోజుకూ సమ్మె ఉధృతం

పలు చోట్ల వివిధ రూపాల్లో నిరసన - వేలాదిగా పాల్గొంటున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి - విజయవాడ : రోజు రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె ఉధృత రూపం దాల్చుతోంది. నగర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కార్మికులతో పాటు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 21వ రోజుకు చేరింది. నాలుగు వేల మంది కార్మికులు సమ్మెలో ఉండటంతో నగర వ్యాప్తంగా శానిటేషన్ కార్యకలాపాలు నిర్వహణ ప్రజారోగ్య విభాగం అధికారులు, ఉద్యోగులకు కష్టతరమయింది. ప్రధాన రహదారులు, ఫోష్ ఏరియాల్లో ఎంతో కొంత శానిటేషన్ పని చేయించినా మురికివాడలు, కొండ ప్రాంతాలు, ఔట్ కట్స్ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహణ ఇబ్బందికరంగానే ఉందని సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాహాటంగానే వ్యక్తం చేస్తున్నారు.

ధర్నాచౌక్‌లో జరుగుతున్న సమ్మె ఉధృతంగా నడుస్తుంది. వందలాది మంది ఇంజినీరింగ్ కార్మికులకు తోడు వేలాది మంది శానిటేషన్ కార్మికులు సమ్మె శిబిరం వద్దకు ఉదయం 10 గంటలకే చేరుకొని వారి ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ (సిఐటియు) యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ అధ్యక్షత వహించగా, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడారు. ఎఐటియుసి దాని అనుబంధం మునిసిపల్ యూనియన్ నేతలు కూడా గమనించాలని, మునిసిపల్ కార్మికులకు ఉపయోపడే రీతిలో ఏ కార్మిక సంఘం అయినా ఉండాలే తప్పా...ద్రోహం చేసే పనులకు పూనుకోవద్దని హితవు పలికారు. కార్మికులను ఉద్యమాల్లోకి పోవొద్దని, వాటంతటవే వేతనాలు పెరుగుతాయని, ఉద్యమాలు చేయడం వృథాప్రయాస అనే రీతిలో స్టేట్‌మెంట్లు ఇస్తూనే మంగళవారం ధర్నా చేయాలని నిర్ణయించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులను గందరగోళానికి, పాలకవర్గాలకు అవకాశం కల్పించే రీతిలో యూనియన్ల పని ఉంటే చివరకు నష్టపోయేది కార్మికులేనని, ఆతరువాత యూనియన్లు క్షీణించిపోవడం ఖాయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంపు, సంక్షేమ పథకాలు అమలు, ఆప్కాస్ కార్మికుల పర్మినెంట్ వంటి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించడానికి యూనియన్ నేతలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కోశాధికారి స్టీఫెన్‌బాబు, నాయకులు టి.ప్రవీణ్, టి తిరుపతమ్మ, కిషోర్ పాల్గొన్నారు.

తిరువూరు : మున్సిపల్ శాఖ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు చేస్తున్న సమ్మె మూడోరోజు మంగళవారం కూడా కొనసాగింది. దీక్షా శిబిరం నిర్వహిస్తున్న నగర పంచాయతీ కార్యాలయం నుండి మెయిన్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. బోసుబొమ్మ బస్టాప్ సెంటర్‌లో కార్మికులనుద్దేసించి సిఐటియు జిల్లా అధ్యక్షులు అగ్నిపత్రి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ముఠా కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నేతలు దీక్షను సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్వీ.భద్రం, నాగరాజు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మంగళవారం నిరసన తెలుపుతూ వంటా వార్పు చేశారు. నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద నందిగామ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె మూడోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి వెంకటేశ్వరావు, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ నాయకులు పరిమి రవి, తానూరి శ్రావణ్ కుమార్, దారెల్లి అశోక్ కుమార్, కుక్కమూడి ప్రమీల, కె.బేబీ, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జివో నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం 26 వేలు అమలు చేయాలి. సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి, ఇంజనీరింగ్ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె 3వ రోజుకు చేరింది. చెవిలో పువ్వులతో విన్నూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ మేస్త్రి ఎం.వాసు, వి శ్రీను, కరెంట్ శ్రీను, నోజు, ప్రకాష్, రామారావు తదితరులు పాల్గొన్నారు. హెచ్‌పిసిఎల్ ఆయిల్ టెర్మినల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్, ఉపాధ్యక్షులు చెన్నారావు సమ్మె శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు.


విజయవాడలోని ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న కాశీనాథ్


ఇబ్రహీంపట్నంలో కొనసాగుతున్న సమ్మె



నందిగామలో వంటా వార్పుతో ....



తిరువూరులో...


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నేటి విద్యార్థులే రేపటి ఛాంపియన్లు

సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :

విద్యార్థుల చిన్ని మెదళ్లలో సృజనాత్మక ఆలోచనలు ఉపాధ్యాయులు పసిగట్టి వారిని ప్రోత్సహిస్తే ఛాంపియన్లుగా, భావితర శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దవచ్చని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ , జిల్లా రిసోర్స్ పర్సన్లకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్' మారిస్ స్టెల్లా కాలేజ్, (విజయవాడ) వేదికగా యూనిసెఫ్, విజ్ఞాన్ ఆశ్రమం సహకారం తో మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్, విజ్ఞానాల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు పాఠశాలల్లో స్టెమ్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశామని అన్నారు. అనంతరం ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా సైన్స్ అధికారులు వారానికొకసారైనా ల్యాబ్స్‌ను సందర్శించి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మార్గదర్శనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్ గైక్వాడ్ (ప్రోగ్రామ్ మేనేజర్ విజ్ఞాన్ ఆశ్రమ్), ఎన్. వెంకట రెడ్డి (వ్యవస్థాపక, టెక్కీబాట్), శ్రావణ్ కుమార్ (మేనేజర్ ఆపరేషన్స్ నవమ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్), సమగ్ర శిక్ష, యూనిసెఫ్, ఎస్సీఈఆర్టీ సిబ్బంది, ఇతర టెక్నికల్ ఏజెన్సీలు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

హెచ్‌పిసిఎల్ ఫౌండేషన్ డే

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఫౌండేషన్ దినోత్సవాన్ని కట్టుబడిపాలెం హిందూస్తాన్ ఆయిల్ కంపెనీలో కార్మికుల సమక్షంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పిసిఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1971లో పాకిస్థాన్ - భారత్ యుద్ధ సమయంలో కాల్ టాక్స్ అనే కంపెనీ ఉండేదని, ఆ యుద్ధ సమయంలో చమురు సమయానికి అందించక సైనికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఏదైనా ఎమర్జెన్సీ సమయంలో ఆయిల్ కావాలంటే ప్రైవేట్ కంపెనీని నమ్ముకుంటే ఇబ్బందులు వస్తాయని కాల్‌టాక్స్ సంస్థను 1974లో ప్రభుత్వం తరుపున ఆయిల్ కంపెనీని జాతీయం చేశారన్నారు. హెచ్‌పిసిఎల్ 51 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్మికులకు బహుమతులు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంట్రాక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అమరావతిలో ఉన్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెలు 18, 19 తేదీల్లో జాతీయ స్థాయి గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్- 2025 నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ఆచార్య డి నారాయణరావు పేర్కొన్నారు. ఈ నదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారని వివరించారు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నీతి అయోగ్ మెంబర్ డాక్టర్ వీ కే సారస్వతతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ సదస్సులో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆచార్య నారాయణరావు సదస్సు వివరాలను వెల్లడించారు. గడచిన 20 ఏళ్లలో దేశ వ్యాప్తంగా విద్యుత్ శక్తి అవసరాలు రెండింతలు పెరిగాయనీ, వికసిత్ భారత్ సాధనలో భాగంగా అన్నింటా అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. విద్యుత్ శక్తికి బదులు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ఎంతో అనివార్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు యూనీవర్సిటీ లో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్కు ఏర్పాటు చేశామన్నారు. విశాఖను గ్రీన్ హైడ్రోజన్ హబ్ గా మార్చాలన్న సీఎం ఆకాంక్ష నెరవేర్చే లక్ష్యంతో హైడ్రోజన్ సదస్సును ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎమెర్జింగ్ టెక్నాలజీతో పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా సమ్మిట్ బ్రోచర్‌ను వేదికపై ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సమ్మిట్ కన్వీనన్లు డాక్టర్ మారం పార్థసారథి, డాక్టర్ సుజిత్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నారాయణరావు, తదితరులు

ఎన్‌టిటిపిఎస్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ వెదజల్లుతున్న కాలుష్యంపై, కాలుష్య నియంత్రణ కోరుతూ పలు ఫిర్యాదులు, ప్రజలు పోరాటం చేయడంతో గ్రీన్ ట్రిబ్యునల్ స్పందించింది. మంగళవారం డాక్టర్ ఎన్‌టిటిపిఎస్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తనిఖీలు నిర్వహించింది. అయితే గ్రీన్ ట్రిబ్యునల్ పర్యటనను అధికారులు రహస్యంగా ఉంచడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర అడవి, పర్యావరణ శాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగినట్లు సమాచారం. మీడియాకు, ప్రజా సంఘాలకు కనీసం సమాచారం ఇవ్వకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఎలక్ట్రికల్ జూనియర్ ఇంజినీర్‌కు
వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని ఆందోళన

విజయవాడ : విజయవాడ నగరంలో ఇళ్లకు షాపులకు ఇప్పటికే పెట్టిన స్మార్ట్ మీటర్లు తొలగించి పాత మీటర్లను బిగించాలని, ఏ ఇంటికీ స్మార్ట్ మీటర్ బిగించొద్దని నినాదాలు చేస్తూ సింగ్ నగర్ ధర్నా చేపట్టారు. స్థానిక సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నా అనంతరం ఎలక్ట్రికల్ జూనియర్ ఇంజనీర్ ఎస్ భాస్కర్ రావుకు అర్జీలు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.కె నిజాముద్దీన్ ఎస్.కె పీర్ సాహెబ్, మహిళా సంఘం నాయకులు ఎస్.కె దేవి కుమారి, ఎస్.విజయలక్ష్మి, వి.జయమ్మ ఎల్.కాశమ్మ, డివిజన్ నాయకులు టి.శ్రీనివాస్ పిఎస్ఎన్ మూర్తి ఎస్ అప్పన్న పాల్గొన్నారు.